

వరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కందుకూరు : మండలంలోని కోవూరు,పందలపాడు గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రాము మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్నాయని, రైతులందరూ పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ ఖాసిం, కోవూరు ఉప సర్పంచ్ కాకుమాని వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ సి హెచ్.నరసింహారావు, రెండు గ్రామాల ,గ్రామ వ్యవసాయ సహాయకులు కె అభిశక్త్, జి. రోజీ , రెండు గ్రామాల రైతులు ,నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు చేస్తున్నఅధికారులు

వాయు 'గండం'..!

నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది.. ఇది గంటకు 15 కి.మీ వేగంతో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతోంది. చెన్నయ్ (తమిళనాడు)కి తూర్పు-ఆగ్నేయంగా 280 కి.మీ., పుదుచ్చేరికి తూర్పు-ఈశాన్యంగా 320 కి.మీ నెల్లూరు (ఆంధ్రప్రదేశ్)కి ఆగ్నేయంగా 370 కి.మీ. సమీపంలో కేంద్రీకృతమైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉదయం చెన్నయ్ - సూళ్లూరుపేట మధ్య తీరందాటే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సమయంలో గంటలకు 40-50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి జిల్లా వ్యాపితంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోద య్యాయి. కలెక్టర్ ఒ. ఆనంద్, ఎస్పి కృష్ణకాంత్ తీర ప్రాంతాల్లో పర్యటించారు. 900 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కావలిలో అత్యధిక వర్షపాతం నమోదైంది. నదులకు వరద పెరుగుతోంది. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మరో 48 గంటలు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

- నేడు సూళ్లూరుపేట వద్ద తీరందాటే అవకాశం
- జిల్లాలో భారీ, అతిభారీ వర్షాలు
- 83 మి.మి. వర్షపాతం నమోదు
- 900 మంది సురక్షిత ప్రాంతాలకు
- తీరప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పి పర్యటన
- నదులకు పెరుగుతోన్న వరద
- నేడు స్కూళ్లకు, కాలేజీలకు సెలవు

గంగపట్నం పాఠశాలల్లో ప్రజలను మాట్లాడుతోన్న కలెక్టర్ ఒ ఆనంద్

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

బంగాళాఖాతంలోని అల్పపీడనం వాయుగుండంగా మారినట్లు విశాఖపట్నంలోని వాతావరణ శాఖ తెలిపింది. నేడు ఉదయం చెన్నయ్- సూళ్లూరుపేట మధ్యలో తీరందాటే అవకాశం ఉన్నట్లు తెలియజేశారు. బుధవారం ఉదయం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో 83 మి.మి. వర్షపాతం నమోదైంది. కావలిలో అత్యధిక వర్షాపాతం వచ్చింది. మూడ్రోజులుగా కురుస్తోన్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ప్రధాన రహదారులు వర్షపునీరు చేరింది. నగరంలోని ట్రంకురోడ్డు, మాగుంట లేవుట్, మన్సూర్‌నగర్, ప్రజాశక్తి నగర్‌తోపాటు అనేక ప్రాంతాల్లో డ్రెయినేజీ కాలువలు పొంగిపొర్లాయి. మున్సిపల్ అధికారులు ఎక్కడికక్కడ జెసిబిలను ఏర్పాటు చేసి కాలువల పూడికలు తీశారు. వర్షపు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పి కృష్ణకాంత్ ఇందుకూరుపేట మండలం, మైపాడు మత్స్యకార ప్రాంతాల్లో పర్యటించారు. తమిళనాడు రాష్ట్రం సరిహద్దులోని మత్స్యకారుల వలన తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని, వారి నుంచి రక్షణ కల్పించాలని మత్స్యకారులు కలెక్టర్‌కు విన్నవించారు. తమిళ జాలర్లు గుంపులు గుంపులుగా పెద్దపెద్ద బోట్లతో వచ్చి తమ మత్స్యసంపదను దోచుకెళ్తున్నారని, తమపై దాడులకు తెగబడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. మత్స్యశాఖ కార్యదర్శికి లేఖ రాశానని, కేంద్రప్రభుత్వం దృష్టిలో కూడా ఈ సమస్య ఉందని చెప్పారు. వీలైనంత త్వరలో ఈ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. మెరైన్, కోస్టుగార్డు పోలీసులతో మాట్లాడతామన్నారు. మత్స్యకారులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న భారీ బోట్లను పొందేందుకు ఆసక్తి చూపాలన్నారు. రూ. 1.20 కోట్ల విలువైన బోట్లను 30శాతం సబ్సిడీతో అందజేస్తామని, జిల్లాలో 50బోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ బోట్లు పొందేందుకు మత్స్యకారులందరూ ఒక గ్రూపుగా ఏర్పడితే ఆర్థికంగా ఇబ్బంది లేకుండా బోటు పొందవచ్చన్నారు. దీంతో అధిక ప్రయోజనాలు పొందవచ్చని మత్స్యకారులకు వివరించారు. సముద్రంలో ఎవరూ వేటకు వెళ్లరాదని, మరో 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. జిల్లాలో జలదంకి, కావలిలో అత్యధికంగా వర్షపాతం నమోదైనట్లు చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని భోజనం, తాగునీరు, మందులు మొదలైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

నగరంలో జెసిబితో పూడికలు తీసుకున్న దృశ్యం

పెన్నానది పరివాహక ప్రాంతంలో కట్టలు బలహీనంగా ఉన్నచోట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో పోలీసు అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిసున్నట్లు చెప్పారు. కాజ్‌వేల వద్ద పోలీసు పహారా ఉంచినట్లు చెప్పారు. గంగపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్, ఎస్పిలు పరిశీలించారు. పునరావాస కేంద్రంలోని ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరాతీశారు. భోజనం, మందులు అందిస్తున్నారా అని అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. బకింగ్ హామ్ కాలువపై బ్రిడ్జి నిర్మించాలని కోరగా పరిశీలిస్తామన్నారు జిల్లాలో ఇప్పటి వరకు 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 312 కుటుంబాల్లోని 900మందిని తరలించారు. పెన్నా, ఇతర కాలువల్లో వరద నీరు ఉధృతి పెరుగుతోంది. పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.ఎలాంటి చర్యలైనా ఎదుర్కొనేలా జిల్లాకు ఐదు ఎస్‌టి ఆర్‌ఎఫ్, రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను కేటాయించారు.

12.3 అడుగులకు చేరిన

'రాళ్లపాడు' నీటి మట్టం

ప్రజాశక్తి - లింగసముద్రం

అల్పపీడిన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 12.3 అడుగులకు చేరింది. గత రెండు రోజుల నుంచి ప్రాజెక్టు ఎక్కువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడడంతో ప్రాజెక్టులోనికి నీరు వచ్చి చేరుతోంది. మరోవైపు సోమశిల ఉత్తర కాలువ నుంచి ప్రాజెక్టులోకి నీరు వస్తుండటంతో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. తుఫాన్ ప్రభావం ఇంకా ఉండడంతో నీటిమట్టం పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు చెప్పారు. పెద్దపవని గ్రామ సమీపంలో ఉన్న ఉప్పుటేరు తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ఉధతంగా ప్రవపి -స్తోంది. దీంతో అధి కారులు అప్రమత్తమయ్యారు.


రాళ్లపాడు ప్రాజెక్టు

రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సబ్ కలెక్టర్

భారీ వర్షాలు కారణంగా రాళ్లపాడు ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ చెప్పారు. బుధవారం సాయంత్రం ఆమె రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టులో ఉన్న నీటిమట్టం గురించి వస్తున్న నీటి వివరాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ప్రాజెక్టు దగ్గర ఉన్న పరిస్థితులను సోమశిల ఉత్తర కాలువ నుండి వస్తున్న నీటి వివరాలను, ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీటి వివరాలను సబ్ కలెక్టర్ కు అధికారులు వివరించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారుల దష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ప్రాజెక్టు వద్ద అలసత్వం వహించకుండా సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు.

పేదల నివాస ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో వర్షాలతో అష్ట కష్టాలు పడుతున్న పేదలను సిపిఎం పట్టణ కమిటీ నాయకులు బందం బుధవారం పరామర్శించింది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉప్పుచెరువు ,సుందరయ్య నగర్,జనార్ధన కాలనీ వంటి ప్రాంతాలలో పేదలు నివసిస్తున్నారు. మూడు రోజులుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులతో ఇళ్లలోకి నీళ్లు వచ్చి ఉన్న ప్రజల కష్టాలను తెలుసుకొని వారిని పరామర్శించారు. ప్రభుత్వం ప్రజలను ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ ఎస్‌ఏ గౌస్, పట్టణ కమిటీ నాయకులు ఎస్.కె మున్వర్ సుల్తానా, ఎం పద్మ ఎస్ పవన్ కుమార్, ఎం ప్రసాద్, ఎస్ కే మల్లికా పాల్గొన్నారు.

పేదలను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

'ఇంటూరి'కి ధన్యవాదాలు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం : అల్పపీడనం కారణంగా గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బడేవారిపాలెం ఎస్‌సి కాలనీలో వర్షపు నీరు చేరి కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని కాలనీవాసులు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు తెలియజేశారు. వెంటనే ఆయన స్పందించి అధికారులను అప్రమత్తం చేసి జెసిపి ద్వారా కాలువలు తీయించి వర్షపు నీరు బయటకు వెళ్లేలా చేశారు. దీంతో స్థానికులు ఎంఎల్‌ఎకు కృతజ్ఞతు తెలిపారు. పనులను పర్యవేక్షించిన తహసీల్దార్ అబ్దుల్ అమీద్, ఎంపిడిఒ నాగేంద్ర దేవ్‌కులకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు

లింగసముద్రం మండలం రాళ్లపాడు ప్రాజెక్టుకు ప్రస్తుతం 12.3 అడుగుల మేర నీరు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నీటిమట్టం పెరిగి అధికారులు గేట్లు ఎత్తి నీరు కిందకు విడుదల చేసే అవకాశముంది. దీంతో ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు ప్రజలను అప్రమత్తం చేశారు. . మన్నేరు ప్రవహించే ఇరువైపుల ఉండే గ్రామప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎల్‌ఎ

బాధితులకు మెరుగైన సదుపాయాలు : కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు

భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి చేరకుండా అవసరమైన అన్ని చర్యలను చేపడుతు న్నామని, అన్ని విభాగాల ప్రభుత్వ అధి కారులను సమన్వయం చేసుకుంటూ ప్రజల జీవనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. బుధవారం నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులతో కలిసి జరుగుతు న్న సహాయక చర్యలను కమిషనర్ పర్యవేక్షించారు.కమిషనర్ మాట్లాడుతూ జెసిబి వాహనాల సహాయంతో నగర వ్యాప్తంగా జరుగుతున డ్రెన్ కాలువల పూడికతీత, ప్రధాన కాలువల ద్వారా వర్షపు నీటి పారుదలకు చేపట్టిన పూడికతీత పనులను కొనసాగిస్తూనే ఉన్నామని చెప్పారు. నగరవా ్యప్తంగా ఉన్న పెద్ద హెూర్డింగులను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల ఆధ్వర్యంలో గుర్తించి ప్రమాదకరమైన స్థితిలో ఉన్న వాటిని తొలగించామని, ఏ ప్రాం తంలో కూడా హెూర్డింగుల వలన ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

వాయుగుండం తీరం దాటుతుందన్న హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ తో ఏపి ఎస్పిడిసిఎ ల్ సిఎండి కె.సంతోష్ కుమార్ బుధవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయుగుండం తీరం దాటుతుందన్న వాచ్చరికల నేపథ్యంలో సిద్ధంగా ఉన్న 120 బ్యాచ్ లు, 674 మంది కార్మికులు సూళ్లూరుపేట కు చేరుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో భాగంగా సిబ్బంది ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్స్ శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్ రెడ్డి, శ్రీధర్, పరంధామయ్య, సుధాకర్, రాఘవేంద్ర, లక్ష్మీ నారాయణ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అశోక్,అల్తాఫ్ మునీంద్ర పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జిల వద్ద నీరు తోడివేత

భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలో జనజీవనానికి ఎక్కడా ఎలాంటి అంతరాయం కలగకుండా మున్సిపల్ అధికారులుయుద్ధప్రాతిపదికన విధులు నిర్వహిస్తు న్నారు.కలెక్టరు ఆనంద్ ఆదేశాల మేరకు నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సహాయక చర్యలను నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పర్యవేక్షిస్తున్నారు. ఆత్మకూరు బస్టాండ్, రామలింగాపురం, విజయమహల్ గేటు, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జిల వద్ద మోటార్లు, మిషన్స్ ద్వారా ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తోడి వేస్తూ రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి వద్ద నీటిని తోడిస్తున్న కమిషనర్

కమాండ్ కంట్రోల్ ద్వారా సత్వర స్పందన

నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం ద్వారా 24 గంటలూ హెల్ప్ లైన్ అందుబాటులో ఉంచారు. ఈ కంట్రోల్ రూంకు వస్తున్న ఫిర్యాదులపై వెంటనే సంబంధిత ప్రాంతపు అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

సెట్నెల్ సిఇఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు

సెట్నెల్ సిఇఒగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బి.శ్రీనివాసరావును పిహెచ్పి రూడ్ససంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఎకె నగర్ లోని సెట్నెల్ కార్యాలయంలో సీఈవో బాధ్యత స్వీకరించిన బి. శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు. సిఇఒ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రూడ్స్, పి.హెచ్.పి సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈరోజు నన్ను సన్మానించడం చాలా ఆనం దంగా ఉందన్నారు. జిల్లా పి.హెచ్.పి గౌరవాధ్యక్షుల ఎ అనుముల జయప్రకాష్, విశ్రాంత ఏఎస్ఐఐ మహబూబ్బాషా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, కె.వెంకటేశ్వర్లు, పి.హెచ్.పి జిల్లా నాయకులు శ ఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, సెట్నల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షాలు

పొంగిన వాగులు, వంకలు - స్తంభించిన జనజీవనం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు నియోజకవర్గంలో గత మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల కారణంగా జనజీవనం స్తంభించింది. వాగులు. వంకలు .ఏర్లు పొంగి ప్రవహించటంతో ఎక్కడికక్కడే రాకపోకలు నిలిచిపోయాయి. కందుకూరు-కొండముడుసుపాలెం మధ్యలో వున్న ఎర్ర వాగు ఉదతంగా ప్రవహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆర్‌టిసి అధికారులు బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎర్ర వాగు తీవ్రంగా ప్రవహించడంతో గుడ్లూరు, చిన్న పవని, పెద్దపవని, దారకానిపాడు, సీతారాంపురం, మోపాడు,మాచవరం వంటి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కందుకూరుకు సమీపంలోని ఆది ఆంధ్ర కాలనీ వద్ద ఉన్న ఉప్పు వాగు పెద్ద ఎత్తున ప్రవహించడంతో రెవెన్యూ అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ప్రజలు ఎవరు ఉప్పు వాగులో దిగకుండా విఆర్‌ఒలను కాపలా పెట్టారు. కందుకూరు పట్టణంలోని సుందరయ్య నగర్ ,ఉప్పుచెరువు, ఏకలవ్వియ నగర్, జనార్ధన కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న వారి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది.

కందుకూరు డివిజన్‌లో భారీ వర్షాలు

కందుకూరు డివిజన్‌లో డివిజన్‌లో 639.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వలేటి వారిపాలెం మండలంలో 77. 6మిల్లీమీటర్లు, కందుకూరు మండలంలో 102. 8 మిల్లీమీటర్లు, లింగసముద్రం మండలంలో 97.6 మిల్లీమీటర్లు, గుడ్లూరు మండలంలో 85.2 మిల్లీమీటర్లు, ఉలవపాడు మండలంలో 72.6మిల్లీమీటర్లు, వరికుంటపాడు మండలంలో 95.6 మిల్లీమీటర్లు, కొండాపురంలో 108.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. బుధవారం ఉదయం 8 గంటల వరకు మాత్రమే ఈ వర్షపాతం నమోదు కాగా ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది.

కందుకూరులో ఇళ్లలోకి చేరిన నీరు

కందుకూరులో జలమయమైన రోడ్డు

నిండిన చెరువులు

ఎడతెరపిలేని వర్షాలతో కందుకూరు సబ్ డివిజన్‌లోని వాగులు, వంకలు, ఏర్లు వరద ప్రవాహంతో పోటెత్తుతున్నాయి. మన్నేరుతో పాటు ఉప్పుటేరు ,ఎలికారు, తూమలేరు వంటి ఎర్లకు నిండుగా వరద నీరు వచ్చింది. పంది వాగు, ఎర్ర వాగు ,ఉప్పు వాగు, చిల్లా కాలవ వాగు వంటి వాగులు వర్షపు నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. మన్నేరు ఎగువ ప్రాంతం నుంచి నీరు రావడం వల్ల రాళ్లపాడులో నీటిమట్టం పెరుగుతోంది. మాచవవరం ,మోపాడు చెరువులకు నీరు చేరుతోంది. గుడ్లూరు మండలంలోని కొత్తపేట, ఉలవపాడు మండలంలోని బద్దిపూడి, భీమవరం ,కే రాజుపాలెం, ఎల్ రాజుపాలెం చెరువులు ఈ ప్రాజెక్టు కింద ఉన్నాయి.ఉప్పుటేరు వరద నీరు బద్దిపూడి వద్ద మన్నేరులో కలవడంతో దిగువ మన్నేరులోనూ నీటి ప్రవాహం దండిగా ఉంది.భీమవరం వద్ద మన్నేరుపై ఉన్న ఆనకట్ట వ్యవస్థ ద్వారా కరేడు, చాకిచెర్ల, పెదపట్టపాలెం చెరువులకు నీటి సరఫరా ప్రారంభమైంది.ఎలికేరు ఉధతంగా ప్రవహిస్తుండటంతో ఉలవపాడు లోని చాగొల్లు పెద్ద చెరువుకు దండిగా నీరు చేరుతోంది.

మాచవరం వద్ద నీటి ప్రవాహంతో నిండుగా కనిపిస్తున్న మన్నేరు

పొంగిన ఏలికేరు, ఉప్పుటేరు

ప్రజాశక్తి-గుడ్లూరు : చెమిడిది పాడు - గుడ్లూరు మధ్యలో ఉన్న ఎలికెరు పొంగి ప్రవహించడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు బుధవారం నిలిచిపోయాయి. చెమిడిది పాడు దగ్గర ఉన్న ఎలికేరిపై నిర్మించిన చప్టాపై వర్షపు నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. అమ్మవారిపాలెం .అడవిరాజుపాలెం అడవి ప్రాంతంలో వర్షం భారీగా పడటంతో ఏలికేరు ఉదతంగా ప్రవహిస్తుంది. గుడ్లూరు -కందుకూరు రహదారిలో ఉన్న ఉప్పుటేరుయఅ వర్షపు నీరు రావడంతో ఏడాది కాలం తర్వాత బుధవారం ప్రవహిస్తుంది.

రహదారులపై వర్షపు నీరు

రోడ్డులో నిలిచిన నీరు

ప్రజాశక్తి -వలేటివారిపాలెం :మండలంలోని పోకూరు పంచాయితీ పరిధిలో ఉన్నటువంటి కుమ్మరిపాలెం గ్రామంలో వర్షం కురిస్తే రోడ్ల మీద మనుషులు నడిచే మార్గం లేకుండా పోతోంది. ఎన్ని సార్లు అధికారుల దష్టికి తీసుకెళ్లినా ఈ సమస్యకి పరిష్కారం దొరకడం లేదు. ఇటీవలే కుమ్మరిపాలెం గ్రామస్తులు ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వర రావుకు అర్జీ అందజేశారు. ప్రధానంగా రెండు సమస్యలు ఉన్నాయి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించినట్లు అయ్యితే కొంత మేరకు సమస్య తగ్గుతుందని అర్జీలో విన్నవినంచారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూడాలని కోరుతున్నారు.

దళిత కాలనీ ఇళ్లలోకి వర్షపునీరు

మండలంలోని వలేటివారిపాలెం గ్రామం ఎస్‌సి కాలనీలో అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చుట్టుపక్కల ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు, వర్షపునీరు వెళ్లే కాలువలు మట్టితో పూడుకపోవడంతో సిమెంట్ రోడ్లపై కురిసిన వర్షపునీరు ఇళ్లలోకి వస్తోంది. గత రెండు రోజుల నుంచి ఎస్‌సి కాలనీ వాసులు వర్షపు నీటిలోనే గడుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షపునీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-ఉదయగిరి : గండిపాలెం గుడినరవ రైతు సేవా కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా బుధవారం 'పొలం పిలుస్తుంది' అనే కార్యక్రమంలో ఆయన పాల్గొని వరి పొలాలను వరిలో కలుపు యాజమాన్యం పద్ధతులు కురుస్తున్న అధిక వర్షాలతో నిలబడిన నీరు బయటకు పంపడం వంటి చర్యలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం వరిలో వచ్చే కాండం తొలుచు పురుగు ఆకు ముడత నష్టాలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలో సుమారుగా 1200 ఎకరాలు వరకు రబీ శనగ సాగు చేయడానికి సిద్ధంగా ఉన్న రైతులు విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.రవికుమార్ తెలిపారు. కావున శనగ సాగు చేసే రైతులు వారి ఆధార్ జిరాక్స్, పొలం పాస్ పుస్తకం జిరాక్స్‌తో రైతు సేవా కేంద్రాలలో నగదు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు శారద తెలిపారు. విరువూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గ్రామ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శారద పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొడవలూరు : కేజీకె రూ.5 సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ అధికారిణి సి.హెచ్.ఎన్.లక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం యల్లాయపాలెం పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉమామహేష్, సుజిత, రైతులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మహిళ

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన యానాదమ్మ హైదరాబాద్ నుండి సొంత ఊరికి వస్తుండగా నంద్యాల వద్ద పక్క సీట్లో ఉన్న బ్యాగును ఆమె గుర్తించింది. బ్యాగును తీసుకొని చూడగా అందులో 9తులాల బంగారు, వెండి ఆభరణాలు ఉండడంతో మర్రిపాడు పోలీసులకు ఆమె సమాచారం ఇచ్చింది. బ్యాగులో ఉన్న పత్రాలు సహాయంతో నంద్యాలకు చెందిన వారిదిగా గుర్తించి గుర్తించిన ఎస్ఐ శ్రీనివాసరావు వారికి సమాచారం ఇచ్చారు. బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు బాధితులకు అందజేశారు. యానాదమ్మను పోలీసులు, బాధితులు అభినందించారు.

'బ్లెస్ట్' హోమ్‌లో పరిశీలన

ప్రజాశక్తి-కావలి : "మీ కోసం" స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వహణలో ఉన్న బ్లెస్ట్‌హోమ్‌ను ఉషాపత్రిక ఎడిటర్, మేనేజింగ్ డైరెక్టర్ బుధవారం సందర్శించారు. తమ ఉషా వద్ద పత్రిక సంస్థ నుండి బ్లెస్ట్ హోమ్‌కు రూ.5వేలను విరాళంగా అందించారు. కార్యక్రమంలో బ్లెస్ట్ హోమ్ విద్యార్థినులతో శరత్‌చంద్ర మాట్లాడుతూ కష్టపడి చదివితే సాధించ లేనిది ఏదీ లేదని మంచి భవిష్యత్తు ఉంటుందని మీ తల్లిదండ్రులు పడే కష్టాలు మీరు పడకూడదంటే మీరు క్రమశిక్షణతో పట్టుదలతో ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించి, మంచి ఉద్యోగాలు తెచ్చుకొని స్థిరపడాలని కోరారు. మహనీయులను ఆదర్శంగా తీసుకొని వారు చేసిన మంచిని గ్రహించి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో మీకోసం సంస్థ వ్యవస్థాపకులు దిలీప్ కుమార్ రాయపాటి మాట్లాడుతూ ఉషా వద్ద పత్రిక ఎడిటర్ శరత్ చంద్ర బ్లెస్ట్ హోమ్‌ను విచ్చేసి విద్యార్థినీలతో తమ సమయాన్ని గడిపి వారిలో మంచి స్ఫూర్తిని నింపి వారి అవసరాల నిమిత్తం నగదును అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. బ్లెస్ట్ హోమ్ కో-ఆర్డినేటర్ డేవిడ్ బాబ్జి మాట్లాడుతూ ఉషా పత్రిక ఎడిటర్ సాహిత్య పరంగా, రాజకీయపరంగా ఎంతో బిజీగా ఉండి కూడా తన విలువైన సమయాన్ని మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థకు కేటాయించి విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపి వారు చక్కగా చదువుకోవడానికి విలువైన అమూల్యమైన అంశాలను నైపుణ్యాలను తెలిపినందుకు మీకోసం సంస్థ తన సహకారాలు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఆహార భద్రతకు ప్రాధాన్యతివ్వాలి

ప్రజాశక్తి-కావలి : ప్రపంచానికి ఆహారం భూమిని పరిరక్షించుకోవడం సామాజిక బాధ్యత అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండయ్య పేర్కొన్నారు. అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలి లేని సమాజాన్ని నిర్మించి, పేదరికం సంపూర్ణంగా నిర్మూలించాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, హరిత పితామహులు, ఎంఎస్ స్వామినాథన్ స్ఫూర్తిగా తీసుకొని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను ప్రజలకు అందించి ఆహార ధాన్యాలను గణనీయంగా ఉత్పత్తి చేయడానికి కృషి చేయాల్సిందిగా కోరుతున్నామని. సంపూర్ణ ఆరోగ్యంగా ప్రజలు జీవించడానికి శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేసి ఆకలి లేని పేదరికం లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు.

భోజనం వితరణ

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవా సంస్థ సభ్యులు సుధాకర్ - విశాలాక్షి దంపతుల కుమార్తె చిన్నారి ధాత్రిక పుట్టినరోజు సందర్భంగా బుధవారం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా బుడంగుంట గిరిజనులకు అల్పాహార భోజనం వితరణ చేయించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ గత మూడు రోజులుగా పడుతున్న భారీ వర్షాల కారణంగా ఏ పనులు లేకుండా ఇంట్లోనే ఉండి, ఇబ్బందులు ఎదుర్కొంటున్న బుడంగుంట గిరిజనులకు తమ కుమార్తె చిన్నారి ధాత్రిక పుట్టినరోజు సందర్భంగా 100మంది పేదలకు అల్పాహార భోజనం ఏర్పాటు చేయించిన సుధాకర్ - విశాలాక్షి దంపతులకు సంయుక్త సేవా సంస్థ ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. సుధాకర్ - విశాలాక్షి దంపతులు గత మూడు సంవత్సరాలుగా సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు సేవలందిస్తూ ఉన్నారని తెలిపారు.

రూ.40వేలు వితరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఇటీవల మృతి చెందిన నలుగురు కుటుంబసభ్యులకు శ్రీ సాంబశివ ఛారిటబుల్ ట్రస్టు అధినేత, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఒక్కొక్కరికి రూ.10వేల వంతున ఆర్థిక సహాయం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని 1వ వార్డుకు చెందిన కోయి పెద్ద నరసయ్య, ఏసుపోగు దొరసానమ్మ, 12వ వార్డుకు చెందిన శాగలమూరి పెంచలయ్య, 15వ వార్డుకు చెందిన గంధ నాగేంద్రలు ఇటీవల మతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు రూ.10వేల వంతున రూ.40వేల ఆర్థికసాయం చేశారు. లబ్ధి పొందిన కుటుంబసభ్యులు కంచి పరమేశ్వరరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రె మృతి

ప్రజాశక్తి-సంగం : దువ్వూరు గ్రామంలోని ఎస్‌టి కాలనీ సమీపంలో బుధవారం విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రోడ్డుకు అనుకుని ఉన్న విద్యుత్ స్తంభం వద్ద ఎర్తింగ్ వైర్‌కు గొర్రె తగిలి విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గొర్రె మృతితో రూ.12వేలు నష్టం వచ్చిందని మధు అనే రైతు తెలిపారు. పక్కనే ప్రాథమిక పాఠశాల, ఎస్‌టి కాలనీ ఉందని వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల వద్ద విద్యుత్ శాఖ వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు తెలిపారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : GUDUR
E.P.No.21/2023
O.S.No.152/2017

Gangavarapu Dhayakar - D.H.R.
Vs
1.Thalluru Venkata Krishnaiah - J.D.R.
2.Thalluru Narasimha Rao
- Respondent / Universal Donee.

Notice to Ist J.D.R.
Thalluru Venkata Krishnaiah, S/o Venkaiah, resident of Lakshminara simhapuram Village, Piduru Post, Manubolu Mandalam, SPSR Nellore District.

పై నెంబరు డిక్రీ హోల్డర్ పై తెలిపిన కోర్టులో మీపై ఇ.పి. దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం తేది18-10-2024కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

దాసు రమేశ్వర్
కె.కొండలరావు
డిక్రీ హోల్డర్ తరుపు అడ్వకేట్స్, నెల్లూరు.

జిల్లాలో కుండపోత వర్షం

స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

ప్రజలందరూ మరో 24 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని, సముద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరూ వేటకు వెళ్లొద్దని జిల్లా కలెక్టర్ ఆనంద్ మత్స్యకారులకు సూచించారు. బుధవారం మైపాడు సముద్ర తీరంలో ఎస్‌పి కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ పర్యటించి స్థానిక మత్స్యకారులతో మాట్లాడారు. అనంతరం గంగపట్నంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్, ఎస్‌పి పరిశీలించారు. పునరావస కేంద్రంలోని ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ ఆరాతీశారు. భోజనం, మందులు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సముద్రంలో ఎవరూ వేటకు వెళ్లరాదని, మరో 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో జలదంకి, కావలిలో అత్యధికంగా వర్షపాతం నమోదైందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని భోజనం, తాగునీరు, మందులు మొదల్కెన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో సుమారు 500 మందికి పైగా ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎవరూ అధైర్యపడొద్దని, జన జీవనానికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ మత్స్యకారులకు భరోసానిచ్చారు. జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతంలో కట్టలు బలహీనంగా ఉన్నచోట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో పోలీసు అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలిస్తున్నామన్నారు. పెన్నా ఆనకట్ట వద్ద పోలీసు పహారా ఉంచినట్లు తెలిపారు. ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉంటూ ఈ రెండురోజులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌పి సూచించారు. కలెక్టర్‌వెంట నెల్లూరు ఆర్‌డిఒ నాగ సంతోష్ అనూష, సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ నాగార్జున రెడ్డి, రెవెన్యూ, పోలీస్ అధికారులున్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలో తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నందున పశువుల మేత తడవకుండా యాజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ గురుజయంతి తెలియజేశారు. కొంతమేర పశువుల మేత, దానా తడిస్తే బూజు పడుతుందని జాగ్రత్తగా భద్ర పరచుకోవాలన్నారు. వర్షం వస్తున్నప్పుడు పశువులను పొలాలలోకి తోలరాదని, కూలిపోయే అవకాశం ఉన్న చెట్ల కింద గోడల దగ్గర, పాకల్లో కట్టి వేయకూడదని తెలిపారు. పశువులు వర్షంలో తడిస్తే శరీర ఉష్ణోగ్రతలు తగ్గిపోయి, జబ్బుపడి చనిపోయే ప్రమాదముందన్నారు. ముఖ్యంగా దూడలు, గొర్రెలను తడవకుండా కాపాడుకోవాలని తెలిపారు. ఏవైనా పశువులు జబ్బుగా ఉన్నట్లయితే దగ్గర్లోని పశువైద్య సిబ్బందికి తెలియజేసి వైద్యం చేయించాలన్నారు. పశువులు ఏవైనా చనిపోతే పశువైద్య సిబ్బందికి తెలియజేస్తే వివరాలను పైఅధికారులకు తెలియజేస్తారన్నారు. గేదెలకు, ఆవులకు పచ్చి దొమ్మ, జబ్బవాపు వ్యాధి రాకుండా, గొర్రెలకు నేల మరక టీకాలు వేయించాలన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : అకాల వర్షాలలో రైతులు పంటను రక్షించుకోడానికి పాటించాల్సిన సూచనలను జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ జి ఎల్ శివజ్యోతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వర్షాలు ఎక్కువగా ఉన్నందున వరి కోతలు కోసిన రైతులు కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని తడవకుండా ప్లాస్టిక్ షీట్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అధిక వర్షాలు కురిసే ప్రాంతాలలో కోత దశలో ఉన్న వరి పొలాల నుంచి అధికంగా నిలిచిన నీటిని వెంటనే తీసేసి నారుమడులలో, ఇప్పుడే నాట్లు వేసిన పొలాల్లో అధిక వర్షం కురిసి నీరునిల్వ ఉండే పక్షంలో వెంటనే ఆ నీటిని పొలం నుండి వెలుపలికి పంపాలన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : తుపాన్ భారీ వర్షాలకు మండలంలోని కొత్తపల్లి, వడ్డిపాలెం, దేవరాయపాలెం గ్రామాల్లో కొమ్మలేరు వాగు వల్ల నీటమునిగిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. పలు గ్రామాల్లో సుమారు 150 ఎకరాలలో వరి పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేశారు. ఆయనవెంట అగ్రికల్చర్ సహాయకురాలు ఉన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ పర్యటించారు. అనంతరం లింగంగుంట గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించి, సమయపాలన పాటించాలన్నారు. ఎవరికీ సెలవులు లేవని వారివారి హెడ్ క్వార్టర్లలోనే ఉండాలని ఆదేశించారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు.

వాగును పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-జలదంకి : తుపాన్ నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లతీ పున్నీసా మండల ప్రజలకు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్‌పి ఆదేశాల మేరకు బుధవారం హామీ తన సిబ్బందితో కలిసి మండలంలోని 17 పంచాయతీలను పరిశీలించారు. గత మూడు రోజుల నుండి ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నందున వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయన్నారు. ముఖ్యంగా వాహన దారులు వాగులు, చపటాలు, దాటేటప్పుడు అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ముఖ్యంగా పశువుల కాపర్లు పొలంలోని వాగులు వంకల వద్ద అప్రమత్తంగా మెలగాలని తెలిపారు. మండలంలోని ఉబ్బుల వాగు, చీకటి వాగు, చెప్పలేరు, గోపాలపాలెం వద్ద ఊళ్ళ వాగు, సోమవరపాడు, చిన్న క్రాక, చెరువు కలుజులను పరిశీలించారు. వర్షాలు తగ్గే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు, పొలాల్లో సంచరించేటప్పుడు కాలువలు గుంతలపై అప్రమత్తంగా మెలగాలని కోరారు.

పిల్లపేరువాగు వద్ద అడ్డుగా ముళ్ల కర్రలను వేసిన ఎస్ఐ రగునాథ్

ప్రజాశక్తి-వరికుంటపాడు : తుపాన్ కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.రగునాథ్ తెలిపారు. మండలంలో గత మూడు రోజులుగా భారీ వర్షాలు పడుతూ ఉన్నాయి. దాంతో వాగులు, చెరువులు వర్షపు నీటితో జలకలను సంతరించుకోగా ఉప్పు వాగు, పిల్లపేరువాగు పొంగి ప్రవహిస్తున్నాయి. కనియంపాడు రామదేవులపాడు మధ్య ఉన్న పిల్లాపేరు వాగు రోడ్డు పారటంతో రాకపోకలు నిలిచిపోయాయి. నక్కల గండి ప్రాజెక్టులో వర్షపు నీరు భారీగా చేరుకుంటుంది. తూర్పు బోయమడుగుల, కనీయంపాడు, తూర్పు రొంపిదొడ్ల, ఉప్పు వాగుల వద్ద తక్కువ ఎత్తు ఉన్న వంతెనలను ఎస్ఐ ఎం.రఘునాథ్ పరిశీలించారు. కణెంపాడు రోడ్డు వద్ద నీరు ఎక్కువగా ఉప్పొంగి పారడంతో కంప అడ్డుగా వేయించారు. అటుగా వర్షాలు తగ్గేవరకు ఎవరు రాకపోకలు సాగించవద్దని సూచించారు. ఎప్పటికప్పుడు తక్కువ ఎత్తు వంతెనలను సిబ్బందితో పరిశీలిస్తూ ప్రజలకు తగు సూచనలు చేస్తున్నారు.

పునరావస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ పావని

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలోని మూడు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్‌టి కాలనీ ప్రజలను గ్రామ సర్పంచ్ కత్తి లావణ్య, విఆర్‌ఒ అశోక్ స్థానిక ప్రాథమిక పాఠశాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసి వసతులు కల్పించిన విషయం విధితమే. ఆ మేరకు బుధవారం ఆత్మకూరు ఆర్‌డిఒ పావని పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ఎస్‌టి కాలనీ ప్రజలతో ఆమె మాట్లాడారు. కేంద్రంలో వసతి ఏర్పాట్లు వివరాలను స్థానిక తహశీల్దార్ వీరవసంతరావును అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ, ఇతర శాఖ అధికారులు పునరావస కేంద్రాలలోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. డాక్టర్ నాగేంద్ర, టిడిపి నాయకులు కత్తి పెంచలయ్య, జనసేన మండల అధ్యక్షులు ఉదయగిరి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల డ్యామ్‌ను ఆత్మకూరు డిఎస్‌పి వేణుగోపాల్ బుధవారం సందర్శించారు. కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, కెపాసిటీని, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో గురించి డ్యామ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమ్మవారి పల్లి వద్ద రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిని పరిశీలించి వాహన రాకపోకలను నిలుపుదల చేసి సమస్యలు తలెత్తకుండా అందరూ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయనవెంట ఎస్ఐ అనూష ఉన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : భారీ వర్షాలు నేపథ్యంలో బుధవారం తహశీల్దార్ సురేష్ బాబు ముంగమూరు గ్రామంలోని పిల్లి వాగును, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించి అక్కడి మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రంలో చేపల వేటలో ఉన్న మద్రాసు బోట్లు వచ్చి హార్బర్‌లో నిలుపుదల చేశారని వారితో మాట్లాడినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వజిత్, గ్రామ రెవెన్యూ అధికారి బాల నరసింహ, మత్స్యకారులు తదితరులున్నారు.

51.6 వర్షపాతం నమోదు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలో బుధవారం తెల్లవారుజాము నుండి 8 గంటల వరకు 51.6 మిల్లీమీటర్ వర్షపాతం నమోదైనట్లు బోగోలు తహశీల్దార్ సురేష్ బాబు తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తి-కావలి : మండలంలోని ఆముదాలదిన్నె ఎస్‌టి కాలనీ నీటమునిగిపోయింది. ఆలా నీట మునిగి ఉన్న ప్రాంతం నుండి 30 మందిని స్థానికంగా ఉన్న మండల పరిషత్ పాఠశాలనకు కావలి ఎం.డి.ఒ. సి.హెచ్. శ్రీదేవి చొరవతో తరలించి, వారికి భోజనం వసతులు ఏర్పాటుచేశారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : ముగమూరు గ్రామంలో ఉన్న పిల్లివాగు నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న ముళ్ల కంచెను, జాడ గోగుల నుండి ఏనుగులుబావికి వెళ్లే మార్గంలో బ్రిడ్జికి అడ్డంగా ఉన్న ముళ్లచెట్లను కావలి రూరల్ సిఐ బి.పాపారావు, బిట్రగుంట ఎస్ఐ బొజ్జ, స్థానిక టిడిపి సీనియర్ నాయకులు ఎన్నబత్తిన వెంకటేశ్వర్లు జెసిపి సహాయంతో ముళ్ల పొదలను బుధవారం తొలగించారు. కావలి రూరల్ సిఐ బి.పాపారావు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో కాలువలకు అడ్డంగా ఉన్న ముళ్ళ చెట్లు ను జెసిపి సాయంత్రం తొలగిస్తున్నామని, తుపాన్ ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మండలంలో పని చేస్తున్నారని, ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చూసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఎన్నబత్తిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రజల అవసరాలను తీర్చేందుకు స్థానిక నాయకులు, కార్యకర్తలు దగ్గరుండి చూడాలి ఆదేశించారని, ప్రజల అవసరాలు తీర్చేందుకు అధికారులు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించామన్నారు. కార్యక్రమంలో బిట్రగుంట పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : బంగాళా ఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా మారింది. వాగులు, వంకలు వద్ద అవసరమైన చర్యలు తీసుకుంటూ గ్రామస్తులకు జాగ్రత్తలు చెబుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ వారికి తగిన సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువుల కట్టలను దెబ్బతినే అవకాశమున్న ప్రాంతాలను ఇరిగేషన్ ఇఇ వెంకటేశ్వర్లు, తమ సిబ్బంది వాటిని పరిశీలించారు. చెరువులకు నీరు చేరి గండ్లు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పునరావాస కేంద్రాన్ని ఆత్మకూరు ఆర్‌డిఒ భూమిరెడ్డి పావని పరిశీలించారు. అక్కడ ఉంటున్న నిర్వాసితులతో మాట్లాడారు. వర్షాలు తగ్గేంత వరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, పునరావాస కేంద్రాల్లో క్షేమంగా ఉండాలని వారికి సూచించారు. అదేవిధంగా సోమశిల జలాశయాన్ని ఆత్మకూరు డిఎస్‌పి కె.వేణుగోపాల్ సందర్శించారు. జలాశయానికి నీరు వస్తున్న నేపథ్యంలో కంట్రోల్ రూము పరిశీలించి ప్రస్తుత నీటి నిల్వవివరాలను అడిగి తెలుసుకున్నారు. కమ్మవారిపల్లి వద్ద చప్టాను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సంగం మండలం వీర్లగుడిపాడు, కోలగట్లలో ప్రజలకు అత్యవసర సౌకర్యం కోసం తహశీల్దారు సోమ్లానాయక్ రెండు బోట్లను సిద్ధం చేశారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలో ఉన్న కనిగిరి రిజర్వాయర్‌ను ఎంపిడిఒ శ్రీహరి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 3.4 టిఎంసిలు కాగా ప్రస్తుతం 1.8 టిఎంసిలు నీరు నిల్వ ఉందని తెలిపారు. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురవనున్న కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటీని దృష్టిలో ఉంచుకొని దిగువకు నీటిని విడుదల చేస్తామన్నారు.

కనిగిరి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక మండలంలోని దామరమడుగు ఎస్‌టి కాలనీ తదితర ప్రాంతాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలు వాటిల్లినప్పుడు అధికారులకు సహకరించి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరారు. మరో 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా ముంపునకు గురైన పలు ప్రాంతాలను ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశానుసారం చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డితో కలిసి బుధవారం పర్యటించారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు, మంగళకట్ట, రామచంద్రపురం తదితర ముంపు ప్రాంతాలను సందర్శించి ముంపునకు గురైన వారి సమస్యలు వెంటనే తీర్చాలని కమిషనర్‌ను ఆమె కోరారు. రానున్న మరో 24 గంటలు జాగ్రత్తలు వహించాలని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. టిడిపి నాయకులు మోర్ల మురళి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కాటంరెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట : తుపాను సమయంలో తీవ్రమైన పెనుగాలులు వీచే అవకాశం ఉందని, పిడుగులు పడే ప్రమాదం ఉంటుంది కాబట్టి పశువుల కాపరులు, రైతులు, ప్రజలందరూ అప్రమగా ఉండాలని మాజీ ఎంఎల్‌ఎ కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అవసరమైతే తప్ప బయటకి వెళ్లొద్దని, చెట్ల కింద, కరెంటు స్తంభాల కింద ఉండకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉంటు జాగ్రత్తలు వహించాలని తెలిపారు. సముద్ర తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలలో వుండాలని సూచించారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వర్షపునీరు తొలిగించాలని వినతి

ప్రజాశక్తి-కోవూరు : తుపాను ప్రభావంతో మండలపరిధిలో పంచాయతీ కాలనీలలో వర్షపు నీరు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోవూరు తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. 5 రోజులుగా వర్షాల వల్ల పనులు లేక ఉన్న పేదలను గుర్తించి పునరావాసా కేంద్రాలు ఏర్పాటు చేసి భోజనం వసతి కల్పించాలన్నారు. తుపాను కారణంగా ప్రతి పేద కుటుంబానికి 20 కేజీలు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గండవరపు బుజ్జియ్య, బట్ట పెద్ద అబ్బాయి, షేక్.బాబు, షేక్ నజీర్, గండవరపు శేషయ్య, సురేష్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవండి.. : మేకపాటి

మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : తీవ్ర తుపాను వర్షాల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని పెన్నా పరివాహక గ్రామాలు, వాగులకు సమీపంలో ఉండే కాలనీల్లో నివసించే ప్రజలకు వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని ఆత్మకూరు మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. తుపాను కారణంగా శనివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలతో పెన్నా పరివాహక ప్రాంతాలు, వాగుల్లో ఉధృతంగా నీరు ప్రవహిస్తోందని, అధికారులు ప్రజలను పునరావాసా కేంద్రాలకు తరలిస్తున్నారని, వారికి పార్టీ తరపున అండగా నిలవాలన్నారు. మరో 48 గంటల పాటు తీవ్ర వర్షాలు కురవనున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కోరారు. నియోజకవర్గ పరిధిలోని వాగుల వద్ద పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల వల్ల ఎవరూ ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అండగా నిలిచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

యానాదులను ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-జలదంకి : ఎడతెరిపి లేని వర్షాల వల్ల ఆకలి దప్పులతో అలమటిస్తున్న చల్లా యానాదులను ఆదుకోవాలని మండల సిపిఎం కార్యదర్శి మేళంగి అంతోని బాబు, ఎపి రైతుసంఘం నాయకులు రావి మాల్యాద్రి బుధవారం తహశీల్దార్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రమైన జలదంకిలో ఉండే చల్లా యానాదులు పేర్లు మాత్రం ఓటర్ లిస్టులో ముందు వరుసలో ఉంటాయన్నారు. అయితే వారి అభివృద్ధి విషయంలో మాత్రం ఆమడ దూరంలో ఉంటారన్నారు. పాలకుల వారిని ఓటు బ్యాంకు మాత్రమే ఉపయోగించుకుంటారని వారి అవసరాల గురించి పట్టించుకోరని వాపోయారు. ఇక్కడ నివసించే వారికి కనీసం కొందరికి ఇళ్లు, మరి కొందరికి ఇళ్ల స్థలాలు కూడా లేవని తెలిపారు. ఒకే ఇంట్లో 4, 5, కుటుంబాలు తలదాచుకుంటాయని తెలిపారు. రెక్కాడితే గానీ డొక్కాడని వీరి జీవితాల్లో తుపాను వల్ల కురిసే భారీ వర్షాలతో పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాంటి పరిస్థితులు పునారవృతమైనప్పుడు అప్పట్లో పనిచేసిన తహశీల్దార్లు వీరిపై ప్రత్యేక చొరవ తీసుకొని వీరికి వసతి ఆహారం ఏర్పాటు చేశారని వారు గుర్తు చేశారు. బత్తల నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎంఎల్‌ఎ సమీక్ష

ప్రజాశక్తి-కావలి

తుపాన్ నేపథ్యంలో ఆర్.డి.ఒ. కార్యాలయంలో అధికారులతో బుధవారం ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆర్.డి.ఒ. వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రవణ్ కుమార్‌లకు వరద సహాయక చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు. కలుగోళమ్మపేట వద్ద అనపగుంట పరిసర ప్రాంతాలను తాను పరిశీలించానని తెలిపారు. అక్కడి నీటిని తక్షణం తొలగించి, ప్రజలకు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా బాలకృష్ణ రెడ్డి నగర్‌లో పర్యటించి, ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వరద బాధితుల సహాయక శిబిరంలో ఆయన మంచినీటి ప్యాకెట్లు, భోజనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కావ్య క్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన కావలిని రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యామన్నారు. సెప్టెంబర్ 1న తుమ్మలపెంట రోడ్డుకు శంకుస్థాపన చేశామన్నారు. కావలిలో 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. అధిక వర్షపాతానికి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడ్డారన్నారు. అనధికార ఆక్రమణలు అడ్డుకట్టల వల్లే లోతట్టు ప్రాంత ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. అధికార యంత్రాంగం మూడు రోజులుగా నిద్రాహారాలు మాని సహాయక చర్యలు చేపట్టడం వల్ల ఆస్తి నష్టాన్ని నియంత్రించ గలిగామన్నారు. చెరువులన్నీ కూడా జలకళను సంతరించుకోబోతున్నాయన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు సహాయంతో త్వరలో రైతులకు నారుమళ్ళకు నీరు అందిస్తామన్నారు. మొదటి సారి ఎంఎల్‌ఎ అయిన తనకు యువ రక్తంతో కూడిన అధికార యంత్రాంగం దొరికిందన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్యతో 15 రోజులుగా అందుబాటులో లేనని, ఎలాంటి ఇబ్బంది వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కావలి మద్దూరుపాడు టిడ్కో నివాసాలను అధికారులతో కలిసి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి పరిశీలించారు. వర్షపు నీరు నివాసాల మధ్య నిలిచిపోవడంతో టిడ్కో నివాసప్రజలు నానా ఇక్కట్లు పడుతుండడాని ఆయన గుర్తించారు. తక్షణమే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలంటూ అధికారులకు ఆదేశాలిచ్చారు. టిడ్కో నివాస సముదాయంలో నివసిస్తున్న ప్రజలకు మంచినీళ్లు భోజన వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచన చేశారు. ఆయనవెంట టిడిపి నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్ బాబు, పోతుగంటి అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి

సుబ్బరామిరెడ్డి సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : చెర్లో సుబ్బరామిరెడ్డి సేవలు మరువరానివని, ఆయన మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని పలువురు నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఆయన వయస్సు (86) అయినప్పటికీ పార్టీపై మమకారం ఇప్పటికీ తగ్గలేదన్నారు. ఎప్పుడు చూసినా పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించేవాడని తెలిపారు. ఆత్మకూరు వార్డు మెంబర్‌గా గెలుపొంది పట్టణ ప్రజల కోసం అనేక సేవలందించారన్నారు. గత 60 సంవత్సరాలు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో ఉండి విడిపోయిన అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్‌లోకి ఆయన అన్న డాక్టర్ చెర్లో రమణారెడ్డి చొరవతో పార్టీలో ఉంటూ ఆత్మకూరు పార్టీ అభివృద్ధి కోసం ప్రచారం చేస్తూ వచ్చాడని తెలిపారు. మొట్టమొదట మాజీ సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్ పూర్తి కాలం కార్యకర్తగా వచ్చినప్పుడు ఆయనతో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఆత్మకూరు తాలూకాలో సిపిఎం కార్యాలయం ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేశారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని క్రిస్టియన్ పేటలో నిర్మించే క్రమంలో ఆయన విరాళాలు ఇచ్చి నిర్మాణానికి తోడ్పడ్డారన్నారు. సొసైటీ చైర్మన్‌గా ఉండి సొసైటీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన చొరవతో బస్టాండ్ వద్ద సొసైటీ నిర్మాణం కోసం కృషి చేశాడని తెలిపారు. నీటి సంఘం అధ్యక్షులుగా రెండుసార్లు గెలుపొంది ఆత్మకూరు చెరువుకు సోమశిల నీళ్లు వచ్చే విషయంలో కృషి చేశారన్నారు. పంట కాలువలను మరమ్మతులు చేయించి పంట పొలాలకు నీరు అందించేందుకు కృషి చేసి ఎంతోమంది రైతులను ఆదుకున్నారని కొనియాడారు. ఆయన ఇంటి వద్ద టెంకాయ తోపులో దాదాపు 150 కుటుంబాలకు ఆర్థికంగా ఉపయోగపడ్డారని తెలిపారు. ఆయన చనిపోవడం సిపిఎం పార్టీకి తీరని లోటుగా పార్టీ నాయకులు కార్యకర్తలు చెప్పుకొచ్చారు.

టిడ్కో గృహాల్లో ప్రమాదాన్ని నివారించండి..

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నెల్లూరు పాలెం సమీపంలో ఉన్న టిడ్కో గృహాల వద్ద వర్షాల కారణంగా అపార్ట్‌మెంట్ వద్ద ప్రమాదం పొంచి ఉందని వెంటనే సరిచేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు అన్నారు. బుధవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ గృహ సముదాయాల ప్రాంగణంలోని ప్రవేశ మార్గం వద్ద వైట్ టైల్స్ జారిపోతూ వర్షాల కారణంగా బురదమయమై జారిపడిపోతున్నారని ఇప్పటికే ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని వీటి కారణంగా ప్రాణాపాయం సంభవించే అవకాశం కూడా ఉందని డేవిడ్ రాజు తెలిపారు. ఇంటిలోంచి బయటికి రావాలంటే కూడా భయపడిపోతున్నామని గృహస్తులు తెలుపుతున్నారు. కొన్నిచోట్ల జారి పడకుండా ఉండే ఎరుపు రంగులో టైల్స్ ఉన్నాయని అధిక శాతం జారిపోయే వైట్ టైల్స్ వల్ల భారీ ప్రమాదం ఉందని వెంటనే వీటిని మార్చవలసిందిగా వారు కోరుతున్నారు. నీళ్ల సమస్య కారణంగా కొన్నిసార్లు అపార్ట్మెంట్ లో ఉండే వాళ్లు నీళ్లు పట్టుకుని వెళ్ళేందుకు వచ్చిన క్రమంలో జారి పడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని ఇలా పడకుండా ఉండే టైల్స్‌ను ప్రధాన మార్గం వద్ద ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. అసలు అధికారులు ఈ గృహ సముదాయాల వైపు రావడం లేదని వీరి సమస్యలు ఏమీ కూడా పట్టించుకోవడం లేదని తెలియజేశారు.

టిడ్కో గృహాలవద్ద పరిశీలిస్తున్న దృశ్యం

కూలిన ఇల్లు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ఎఎస్‌పేట గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో పులి రమణయ్య అనే వ్యక్తికి సంబంధించిన రేకుల ఇంటి గోడలు బాగా తడిచి రేకులు ఒక్కసారిగా కూలి పోయింది. ఈ విషయాన్ని సంబంధిత తహశీల్దారు, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులకు తెలియజేయడంతో అధికారులు సత్వరమే రమణయ్యను, కూలిన ఇంటిని, పరిశీలించారు. ఆ కుటుంబాన్ని అదే గ్రామంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోనికి, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు, మార్చారు. బాధిత కుటుంబాన్ని తహశీల్దారు రామకృష్ణ, విఆర్‌ఒలు, ఎంపిడిఒ ప్రసన్నకుమారి, పంచాయతీ సెక్రటరీ వినాయక్ పరామర్శించారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

-బుచ్చిరెడ్డిపాలెంలో నిరసన తెలుపుతున్న ప్రజలు

టిపిగూడూరు మండలంలోని నరుకూరు సెంటర్‌లో

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గత ప్రభుత్వంలో ఐదేళ్ల ఇక్కడ మద్యం దుకాణం ఉండడంవల్ల నరకం చూశామని ఈ ప్రభుత్వంలో నైనా న్యాయం జరగాలని మహిళలు నిరసన చేపట్టారు. పట్టణంలోని బాంబే రోడ్డుకు అనుకొని శాంతినగర్ లో మద్యం దుకాణం ఉండగా నూతన మద్యం పాలసీ అమల్లోకి రాగా యథావిధిగా బుధవారం మద్యం దుకాణం అక్కడే కొనసాగించాలని మద్యం సరుకును దించే క్రమంలో మహిళలు అడ్డుకొని ఆందోళన చేశారు. ఇంతలోనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మహిళలను అడ్డుకొని వివరించి దుకాణాన్ని మూసివేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ స్థానికంగా ఎన్నో కుటుంబాలు ఇక్కడ నివాసాలు ఉన్నాయన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే దగ్గర మద్యం దుకాణం ఉండకూడదన్నారు. అక్కడకు వచ్చే మందుబాబుల వల్ల మహిళల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని మండిపడ్డారు. మద్యం దుకాణం ముందు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు అడ్డంగా ఉండటంవల్ల దారి లేక స్కూలుకు, కాలేజీలకు, గుడికి వెళ్లే మహిళలకు ఆటంకం కలుగుతుందన్నారు. పిల్లలు అటుగా వెళ్లాలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేకాక మందుబాబుల ఆగడాలు శృతిమించి అక్కడే మద్యం సేవిస్తూ మల్లవిసర్జన చేస్తూ సీసాలు రోడ్లపైనే పగలగొడుతున్నారన్నారు. ఎవరైనా అడిగితే వారి పైన దౌర్జన్యాలకు దిగుతున్నారని మహిళలు చెబుతున్నారు. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవ తీసుకొని మద్యం దుకాణాన్ని ఇక్కడ లేకుండా చేయాలని మహిళలు వేడుకుంటున్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

ఇళ్ల మధ్య మద్యం షాపును ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో రెండో రోజు ఆందోళన కార్యక్రమం జరిగింది. వివరాల మేరకు.. మండలంలోని నరుకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని సిపిఎం ఈ నెల 15 వ తేదీ ఆందోళన ప్రారంభించింది. తిరిగి బుధవారం ఆందోళనను కొనసాగించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇళ్ల మధ్య మద్యం షాపు వద్దు మహాప్రభో అంటూ నినాదాలు చేశారు. గత ప్రభుత్వంలో అదే ప్రాంతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు చేసిందని దాంతో గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం ప్రజలు నరకం చూశారని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ అదే ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం సేవించి అందుకు వీల్లేకపోయినా ప్రజలకు మందు బాబులు నరకం చూపించారని తెలిపారు. ఇప్పటి ప్రయివేట్ మద్యం దుకాణంలో మద్యం సేవించేందుకు పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే మద్యం బాబుల ఆగడాలతో తాము ఎలా బతకాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ బ్రాందీ షాప్ పెట్టే ప్రయత్నం చేస్తే ఎన్ని రోజులైనా పోరాటానికి సిద్ధం అని గ్రామ ప్రజలు, సిపిఎం నాయకులు హెచ్చరించారు.

కోడూరు తీరంలో అలల అలజడి..

-ముందుకు దూసుకొచ్చిన కడలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

అల్పపీడనం వాయుగుండంగా మారింది.. నైరుతి బంగాళాఖాతంలో తమిళనాడుకు తూర్పు-ఆగ్నేయంగా 490 కి.మీ., పుదుచేరికి తూర్పు- ఆగ్నేయంగా 500 కి.మీ, ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు)కి ఆగ్నేయంగా 590 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైనట్లు వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రభావంతో మండలంలోని కోడూరు, కాటేపల్లి సముద్ర తీర ప్రాంతాలలో పరిస్థితులు అల్లకల్లోలంగా మారాయి. అంతేకాకుండా అలలు హద్దులు దాటుతున్నాయి. కెరటాలు ముందుకు దూసుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీరప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. తీర ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పుడే పరిస్థితులు ఇంత భయానకంగా ఉంటే వాయుగుండం ఉత్తర తమిళనాడు-దక్షిణ ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి-నెల్లూరు మధ్య తీరం దాటే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికల నేపధ్యంలో పరిస్థితులు ఇంకెలా ఉండబోతాయో అని మండల ప్రజలు, ముఖ్యంగా తీరప్రాంతాల ప్రజలలో తీవ్ర భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వాయుగుండం ప్రభావంతో పట్టపగలే చీకట్లు కమ్ముకున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా తయారైంది. పెద్ద శబ్దాలతో కెరటాలు తీరాన్ని తాకుతున్నాయి. సముద్రం 50 మీటర్లు ముందుకు చొచ్చుకొచ్చింది. దీంతో తీరంలోని గ్రామాల మత్స్యకారులు కలవరపడుతున్నారు. ఓ వైపు రాకాసి అలలు, మరోవైపు పెనుగాలుల దెబ్బకు ప్రజలు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు వీస్తున్న బలమైన చలిగాలులకు వణికిపోతున్నారు. పలు ప్రాంతాల్లో వాయుగుండం బీభత్సం సృష్టించింది. కురుస్తున్న భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీచిన పెనుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలీ పనులు లేకపోవడంతో నిరుపేదలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.

సిసి రోడ్లకు ఎంఎల్ఎ శంకుస్థాపన

శంకుస్థాపన కార్యక్రమంలో ఎంఎల్ఎ కాకర్ల

ప్రజాశక్తి-వింజమూరు: మండల పరిధిలోని పలు గ్రామాలలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రూ.2.86 లక్షల పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తలపెట్టిన పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమంలో జరుగుతాయన్నారు. అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులను గుర్తించి వాటికి కార్యరూపం దాలుస్తున్నామని తెలియజేశారు. బాగానే గ్రామాలలో పలు సమస్యల పైన ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.వాటిని కూడా పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అన్ని గ్రామాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని ప్రజలందరికీ తెలియజేశారు. మండల పరిధిలోని కాటేపల్లి,రాగిపాడు, నందిగుంట, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ గ్రామాలలో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. టిడిపి మండల కన్వీనర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలన్నీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాగల సురేష్, మాజీ ఎమ్మెల్యే ఖమ్మం మిజిరామిరెడ్డి, అనసూయమ్మ దంతులూరి వెంకటేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు, సిఐ వెంకటనారాయణ, ఎస్ఐ వీర ప్రతాప్, టిడిపి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యాలపై జాగ్రత్తలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: ప్రజల ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, క్షయ నివారణాధికారి, డాక్టర్ ఎస్.కె.ఖాదర్ వలీ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని వరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూఫాన్ ప్రభావిత ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. నీటి నిల్వలున్న ప్రాంతాలను గుర్తించి పంచాయతీ అధికారులకు తెలియజేయాలని చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి ప్రజల ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధూ మేఘన, పిహెచ్.సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని పైడేరు వాగుకు పెద్ద గండి పడటంతో చుట్టుపక్కల గ్రామస్తులు ఉండగా సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ చంద్ర శేఖర్, ఎంపీడీఓ నగేష్ కుమారిల చొరవతో జెసిబి పంపి గండి పూడ్చారు. గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పైడేరు వాగుకు ఈ గండి పడింది. ఈ గండి పూడ్చినందుకు చుట్టుపక్కల గ్రామస్తులు ధైర్యంగా ఉండవచ్చని తెలిపారు.

ప్రపంచ పటంలో కృష్ణపట్నం..!

-అభివృద్ధి అంతంత మాత్రం..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పేరు గొప్ప..ఊరు దిబ్బ అనే నానుడి ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామానికే సరిగ్గా సరిపోతుంది. ప్రపంచ పటంలో కృష్ణపట్నం గ్రామం స్థానం అత్యంత పదిలంగా ఉంది గానీ, అభివృద్ధిలో మాత్రం అత్యంత హీనం. ఈ పంచాయతీకి ఆదాయ వనరులేవు అనుకుంటే పొరపాటు. కృష్ణపట్నం పంచాయతీ పరిధిలో ఎన్నో భారీ పరిశ్రమలు ఉన్నాయి. వాటి నుంచి కృష్ణపట్నం పంచాయతీకి పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు రాబడి వస్తుంటుంది. ప్రత్యేకించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అదాని కృష్ణపట్నం పోర్టు నుంచి ఈ పంచాయతీకి సంవత్సరానికి దాదాపు కోటి రూపాయలకుపైగా రాబడి ఉంది. పోర్టు కాకుండా పలు భారీ పరిశ్రమలు కృష్ణపట్నం పంచాయతీ పరిధిలో ఉన్నాయి. వీటి నుంచి కృష్ణపట్నం పంచాయతీకి పన్నుల రూపంలో ఏటా కోటి రూపాయలకు పైగానే ఆదాయం వస్తుంది.కోట్లాది రూపాయలు రాబడి ఉన్నప్పటికీ ఈ పంచాయతీ ఏమాత్రమూ అభివృద్ధికి నోచుకోక పోవడం గమనార్హం. మంజూరవుతున్న నిధులు నేరుగా నాయకుల జేబుల్లోకి వెళ్తుండడమే అందుకు కారణం. ఈ పంచాయతీకి చెందిన ప్రజా ప్రతినిధులు కోట్లకు పడగలెత్తుతున్నారు గానీ పంచాయతీ అభివృద్ధి గురించి ఏమాత్రమూ పట్టించుకోక పోవడం విచారకరం. ఈ గ్రామానికి తాగునీటి వసతి కల్పించాలన్న ఉద్దేశంతో వైసిపి ప్రభుత్వ పాలనలో ముత్తుకూరు నుంచి కృష్ణపట్నం గ్రామానికి ఒక్కో సారి 30 లక్షల రూపాయలు వెచ్చించి మూడుసార్లు 90 లక్షల రూపాయలు వెచ్చించి పైప్ లైన్లు నడపడం జరిగింది. అయినప్పటికీ నేటికీ ఒక్క కుళాయి నుంచి కూడా చుక్క నీరు విడుదల కాకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధులు అభివృద్ధి చెందుతున్నారు గానీ, పంచాయతీ అభివృద్ధి మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న" చందంగా తయారైంది.

పూల బొకే అందజేస్తున్న నాయకులు

'తిరుమూరు'కు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన అభివృద్ధి ప్రదాత ప్రజా సేవకులు తెలుగు దేశం పార్టీ నాయకులు తిరుమూరు అశోక్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన నివాసంలో అభిమానులు, టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. కోవూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంచారు. జన్మదిన వేడుకల్లో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అశోక్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి యదలపూడి నాగరాజు, జీవీ నాగరాజు, మాజీ సర్పంచ్ అంగిరేకుల కృష్ణ ప్రసాద్, మాజీ కో ఆప్షన్ జహంగీర్, నాటకరాణి వెంకట్, అంకయ్య, వహీద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జతిన్ త్రివేది

నైపుణ్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

నైపుణ్యాభివృద్ధికి అదాని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా కృషి చేయడం జరుగుతుందని సీఈఓ జితిన్ త్రివేది పేర్కొన్నారు. బుధవారం కృష్ణపట్నం పోర్ట్ లో అదాని స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లో పోర్ట్ సంబంధిత కోర్సులను పోర్ట సీఈఓ జగదీష్ పటేల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జతిన్ త్రివేది మాట్లాడుతూ అదాని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ (ఏ.ఎస్.డి.సి) కృష్ణపట్నంలో పోర్ట్ సంబంధిత కోర్సుల శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతకు నైపుణ్య అభివృద్ధిలో అదాని స్కిల్ డెవలప్మెంట్ కృషి చేస్తుందని తెలిపారు అదాని కృష్ణపట్నం పోర్ట్ " జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోర్ట్, లాజిస్టిక్స్ రంగం ప్రస్తుత విస్తృతంగా అభివృద్ధి చెందుతూ ఉన్నాయి. ఆ నేపథ్యంలో, యువతకు పోర్ట్ రంగంలో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును కల్పించుకునేందుకు వీలుగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. ఆర్.టి.జి) క్రేన్ (రబ్బర్ టైర్డ్ గ్యాంట్రీ), ఎం.ఇ.ఎం.ఎస్ (మెరైన్ ఇంజన్స్, మెకానికల్ సిస్టమ్), ఎల్.ఎం.వి (లైట్ మోటార్ వెహికల్) హెచ్.ఎం.వి (హెవీ మోటార్ వెహికల్) తదితర అధునాతన కోర్సులు, మారుతున్న అవసరాలకు అనుగుణంగా, యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి సహాయపడనున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా, తమ కేంద్రం యువతకు నాణ్యమైన శిక్షణను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ప్రవేశ పెట్టిన కొత్త కోర్సులు పోర్ట్ కార్యకలాపాలకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, సీఓఓ రాజన్ బాబులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభం ద్వారా యువత సమగ్ర అభివృద్ధి సాధించాలని, ఈ ప్రాంత యువతకు అత్యుత్తమ ఉద్యోగ అవకాశాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జి.వేణుగోపాల్, కళ్యాణ్ పాల్గొన్నారు.